క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 13న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. ఆర్టీఓ ఆఫీస్, గణేష్‌నగర్, రహమత్ నగర్, శేషాద్రి హిల్స్, 4వ బెటాలియన్, టీచర్స్ కాలనీ, మంగలమ్మ కుంట, లెనిన్‌నగర్, వసంతపూర్, దూపకుంట ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు మజ్జిగ పంపిణీ



హన్మకొండ: ఎండ వేడి, వడదెబ్బ నుంచి ఉపశమనం పొందేందుకు టీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు మజ్జిగ పంపిణీ చేశారు. వరంగల్ -1 డిపోలో ఉద్యోగులకు మజ్జిగ ప్యాకెట్లను డిపో మేనేజర్ పి.శ్రీనివాస్ రావు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా ఉద్యోగులకు మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ టి.సంతోష్, ఎంసీ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి వధూవరులకు 'తోడు నీడ'



కాజీపేట అర్బన్: ఉమ్మడి వరంగల్ జిల్లా తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వధూవరుల పరిచయ వేదికను 'తోడు నీడ' పేరిట హనుమకొండ హంటర్‌రోడ్డులోని బీసీ నేత హాస్టల్‌లో ఆదివారం నిర్వహించారు. పద్మశాలి కుల బాంధవులలో రెండవ వివాహం కొరకు ఎదురుచూసే వారికి తోడు నీడ పేరిట వివాహ పరిచయ వేదికను ఏర్పాటు చేసినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు కోడం రవిప్రకాష్ తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు వంద మంది పాల్గొన్నారని వివరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర మ్యారేజ్ బ్యూరో కన్వీనర్, జిల్లా కోశాధికారి లకుం నవీన్ రాజకుమార్, సిరిపురం శేఖర్, గోరంట్ల అశోక్, క్యాతం ఆనంద్, ముల్క శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాకు పాల్పడుతున్న బీఆర్ఎస్ నాయకులు



న్యూశాయంపేట: ప్రభుత్వ, చెరువు శిఖం భూములను అధికార పార్టీ బీఆర్ఎస్ నాయకులు కబ్జా చేస్తున్నారని బీజేపీ వరంగల్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ఆడెపు రమేష్ ఆరోపించారు. ఈమేరకు ఆదివారం వరంగల్ చింతల్ బ్రిడ్జి నుంచి కబ్జాకు గురైన స్థలం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం అక్కడ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్, శ్రీధర్, రాజ్‌కుమార్, అనిల్, మహేష్, రాజేంద్రప్రసాద్, చంద్రమోహన్, కోటి, మధుకుమార్, సంపత్, మల్లికార్జున్, ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.

తరుణ్‌చుగ్‌కు సన్మానం

హన్మకొండ: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్‌ను బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ సన్మానించారు. పార్లమెంట్ ప్రవాస యోజనలో భాగంగా వరంగల్ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ కోర్ కమిటీ సభ్యుల సమావేశంలో పాల్గొనేందుకు ఆదివారం నగరానికి వచ్చిన తరుణ్‌చుగ్‌కు హనుమకొండలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండె విజయరామారావు, నాయకులు రావు అమరేందర్ రెడ్డి, కందగట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది కలగకుండా చూడాలి



కాజీపేట: ఫాతిమా ఉత్సవాలను తిలకించడానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని ఏసీపీ శ్రీనివాస్ సూచించారు. ఫాతిమా మాత ఉత్సవాలను పురస్కరించుకొని కాజీపేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో పోలీస్ సిబ్బందికి ఆదివారం డ్యూటీలను కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల్లో పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ పనిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి, ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన డ్రైయినేజీ నిర్మాణం

- జూలైలో మొదలైన పనులు
- గుంతల కారణంగా స్థానికులకు ఇక్కట్లు



పూర్తికాని డ్రైయినేజీ నిర్మాణ పనులు

మడికొండ: 64వ డివిజన్ మడికొండ వేణుగోపాల స్వామి ఆలయం వద్ద నుంచి మడికొండ ఊరిచివరి వరకు చేపట్టిన డ్రైయినేజీ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. గతేడాది జూలైలో ప్రారంభమైన పనులు ఇంకా పూర్తికాకపోవడంతో స్థానికులు, వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ముందుకు సాగని పనులు

సుమారు రూ.43 లక్షల వ్యయంతో చేపట్టిన డ్రైయినేజీ పనులకు వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ శంకుస్థాపన చేశారు. ఈ పనుల టెండర్ దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ గోతులు తీసి, మట్టిని రోడ్డుపై పోసి వదిలేశాడు. దాంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులను త్వరగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే రమేష్‌ను నెల క్రితం స్థానికులు కలిసి కోరారు. చేసిన పనులకు బిల్లుల రాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదని కాంట్రాక్టర్ చెబుతున్నాడు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

ప్రహరీ కూల్చి ఇబ్బంది పడుతున్నాం



త్వరగా మురుగునీటి కాలువ నిర్మిస్తారని ఇంటి ముందు ఉన్న ప్రహరీ కూల్చి వేశాం. ఇప్పటికి 8నెలలవుతున్నా కాలువ నిర్మాణం పూర్తి కాలేదు. దాంతో ఇంట్లోకి కుక్కలు, పందులు, విష పురుగులు వస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి డ్రైయినేజీ నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చూడాలి.

-కుక్కల సమ్మయ్య, స్థానికుడు



శిలాఫలకం

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

హసన్‌పర్తి: సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. నగరంలోని 56వ డివిజన్‌లో సుమారు రూ.6.90 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలీన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి పనులు చేపడుతున్నట్లు వివరించారు. బంజారా భవన నిర్మాణానికి అదనంగా మరో రూ.50 లక్షలు, గౌడ సంఘం కమ్యూనిటీ ప్రహరీ నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. గోపాలపూర్‌లో జంక్షన్ అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని చెప్పారు. అలాగే నవభారత్ కాలనీలో ఆర్చ్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. స్థానిక కార్పొరేటర్ సిరంగి సునీల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు మణీందర్‌నాథ్, అటికం రవీందర్, మాజీ ఉపసర్పంచ్ చింతల రమేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి లోనికి చందర్, కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే రమేష్

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నగరంలోని రెండవ డివిజన్ గుండ్లసింగారానికి చెందిన ఐదుగురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. హనుమకొండలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అరూరి రమేష్ మాట్లాడుతూ వధువు కుటుంబానికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు వరంలాంటివని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ బానోతు కల్పన, డివిజన్ అధ్యక్షుడు జంగా కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గనిపాక విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బద్నాం చేసేందుకే కల్పిత లేఖ



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వరంగల్ చౌరస్తా: నక్సలైట్ల ఉద్యమంలో పనిచేసిన కొందరు కల్పిత లేఖను విడుదల చేసి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌ను బాద్నం చేయాలని చూస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ఆదివారం వరంగల్ స్టేషన్ రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు చింతాకుల సునీల్, దుబ్బా శ్రీనివాస్, కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, బాల్నె సురేష్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధారాలు ఉంటే నిరూపించాలని డిమాండ్ చేశారు. కబ్జా చేసినట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే దేనికైనా సిద్ధమేనన్నారు. ఓ వ్యాపారవేత్తకు ఎమ్మెల్యే బినామీ అని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వారిపై న్యాయపరంగా ముందుకెళ్తామని చెప్పారు. సదరు వ్యాపారికి బీజేపీ అగ్రనేతలతో సంబంధాలున్నాయని పేర్కొన్నారు. ఈ విషయమై పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ జారతి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టంపై అవగాహన అవసరం



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

హన్మకొండ: వినియోగదారుల చట్టంపై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కన్స్యూమర్ కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్ అన్నారు. హనుమకొండ భవానినగర్‌లో వినియోగదారుల చైతన్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల సవరణ చట్టం 2019 ద్వారా వినియోగదారుల రక్షణకు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు చెప్పారు. వినియోగదారుడు నష్టపోతే నష్టపరిహారం పొందవచ్చని అన్నారు. ఈ సందర్భంగా 'స్వచ్ఛమైన శక్తి పరివర్తన' (క్లీన్ ఎనర్జీ ట్రాన్సిషన్) పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో సీసీఐ హనుమకొండ జిల్లా గౌరవ అధ్యక్షులు తోకల సుధాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రాగి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పత్తిపాక తిరుపతి, కోశాధికారి చిలగాని నరహరి, సభ్యులు ముస్కుల కిరణ్ కుమార్, సదానందం, జితేందర్, దేవేందర్, విజయ్ కుమార్, సంజీవ్, అయిలా రెడ్డి, త్రిపురోజు రవి కుమార్ పాల్గొన్నారు.

కళాకారుల సంక్షేమానికి కృషి



మామునూరు: రాష్ట్ర జానపద కళాకారుల సంక్షేమానికి మరింతగా కృషి చేస్తానని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి హామీ ఇచ్చారు. ఈమేరకు హనుమకొండలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ధర్మారెడ్డిని రాష్ట్ర జానపద కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూపకుంటకు చెందిన పోలెపాక రమేష్, తదితరులు ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కనుమరుగవుతున్న జానపద కళారూపాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో 17వ డివిజన్ కార్పొరేటర్ గద్దె బాబు పాల్గొన్నారు.

ఉత్సవాలను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

వరంగల్: ఈనెల 10నుంచి 31వరకు జరగనున్న అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల ఉత్సవాలను విజయవంతం చేయాలని వరంగల్ లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ ఎం.అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. 'వినియోగదారుల హక్కులు - బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్' వాల్ పోస్టర్లను పోచమ్మమైదాన్‌లో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వినియోగదారుల మండలి జాతీయ కార్యదర్శి సాంబరాజు చక్రపాణి మాట్లాడుతూ ఏప్రిల్ 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా బంగారు ఆభరణాలపై హాల్ మార్కింగ్‌తో పాటు, ప్రతీ ఆభరణంపై తప్పనిసరిగా హెచ్‌యూఐడీ నంబర్ ఉండాలని కేంద్ర వినియోగదారుల మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసిందని గుర్తుచేశారు. ఈ నిబంధనలు అమలయ్యేలా లీగల్ మెట్రాలజీ శాఖ పర్యవేక్షణ ఉండాలని వినియోగదారుల మండలి ప్రతినిధులు అసిస్టెంట్ కంట్రోలర్ అన్నారు. కార్యక్రమంలో సీసీఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్, మండలి రాష్ట్ర కమిటీ సంయుక్త కార్యదర్శులు చిలువేరు ప్రవీణ్, నల్లా రాజేందర్ పాల్గొన్నారు.

మహిళలకు సన్మానం



కాజీపేట: అంతర్జాతీయ మహిళా వారోత్సవాలను పురస్కరించుకుని వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న మహిళలను కాజీపేట 61వ డివిజన్ సిద్ధార్థనగర్ పార్కులో కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎలకంటి రాములు, కుమ్మరి కోటిలింగంతో పాటు బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నియామకం

కాజీపేట: కాజీపేట పట్టణ ప్రదేశ్ గంగపుత్ర (బెస్త) సంఘం ప్రధాన కార్యదర్శిగా పాక ఓంప్రకాష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం ప్రధాన కార్యాలయంలో ఆదివారం జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఓంప్రకాష్‌ను సభ్యులు సన్మానించారు. అలాగే, పదవీ విరమణ చేయనున్న అనుమల శ్రీనివాస్‌ను సత్కరించారు. కార్యక్రమంలో పాక వేదప్రకాష్, శ్రీనివాస్, కె.రఘు, శంకర్, నర్సయ్య, డోలి గోపాల్, సాంబమూర్తి పాల్గొన్నారు.

చైతన్యయాత్రను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

న్యూశాయంపేట: ఈనెల 17న నిర్వహించనున్న జనయాత్ర చైతన్య బస్సు యాత్రను విజయవంతం చేయాలని సీపీఎం హనుమకొండ జిల్లా కన్వీనర్ బొట్ల చక్రపాణి పిలుపునిచ్చారు. హనుమకొండలోని పార్టీ ఆఫీస్‌లో వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాత్ర సందర్భంగా హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సభకు ముఖ్యఅతిథిగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య, సీతారాములు, తదితరులు పాల్గొంటారని తెలిపారు. అధిక సంఖ్యలో నాయకులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వాసుదేవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చుక్కయ్య, ఉప్పలయ్య, వీరన్న, రమేష్, వెంకట్, రాములు, సంపత్, లింగయ్య పాల్గొన్నారు.

గౌడ కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలి



గణపతి గౌడ్‌ను పరామర్శిస్తున్న నాయకులు

హన్మకొండ: తాటిచెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి తీవ్ర గాయాలపాలై వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతున్న భూపాలపల్లి జిల్లా నేరేడుపల్లికి చెందిన గంట గణపతి గౌడ్‌కు ప్రభుత్వం మెరుగైన చికిత్స అందించాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ కోరారు. గౌడ కులస్తుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. ఈమేరకు గణపతిగౌడ్‌ను బీసీ సంక్షేమ సంఘం, సర్వాయి పాపన్న గౌడ సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సర్వాయి పాపన్న గౌడ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ శ్రీపతి గోపి గౌడ్ మాట్లాడుతూ ప్రమాదాల నివారణ నివారణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, తాటి చెట్టు ఎక్కే యంత్రాలను గీత కార్మికులకు ఉచితంగా పంపిణీ చేయాలని, హైబ్రిడ్ పొట్టి తాటి చెట్లను అన్ని గీత సొసైటీలకు ఉచితంగా అందించాలని కోరారు. కార్యక్రమంలో తాళ్లపల్లి రమేష్ గౌడ్, ఏరుకొండ రమేష్, శ్రీపతి ప్రశాంత్ గౌడ్, పొన్నం రాకేష్ గౌడ్, వేముల రాజయ్య, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, పొన్నం రాంబాబు, వేముల బాలకృష్ణ గౌడ్, పంజాల రాజకుమార్, పొన్నం లక్ష్మణ్ పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులుగా గుర్తించాలి



నూతన కమిటీ ప్రతినిధులు

ఖిలా వరంగల్: వరంగల్ ప్లంబింగ్, శానిటరీ వర్కర్లను అసంఘటిత కార్మికులుగా గుర్తించాని వరంగల్ జిల్లా ప్లంబింగ్, శానిటరీ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు సోల రవి, వడ్డె యుగేందర్ కోరారు. వరంగల్ శివనగర్‌లోని పద్మశాలి కమ్యూనిటీ హాల్‌లో వరంగల్ జిల్లా ప్లంబింగ్, శానిటరీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి బొల్ల రాజ్‌కుమార్ అధ్యక్షతన వర్ష శానిటరీ స్టోర్స్ బిల్లా రమేష్ సౌజన్యంతో సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లంబర్లకు ఈఎస్ఐ, పీఎఫ్, బీమా వంటి సౌకర్యాలు కల్పించాలని, డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని, 50ఏళ్లు పైబడిన వారికి పింఛన్ అందజేయాలని కోరారు. అధునాతన శిక్షణ ఇచ్చి గుర్తింపు పత్రం ఇవ్వాలని సూచించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో బండారి సదానందం, మాలోతు బాలరాజు, వల్లకొండ సమ్మయ్య, ముత్తినేని శ్రీనివాస్, వేల్పుల ప్రసాద్, జన్ను అశోక్, సుంకల రవి, చిట్టిమల్ల రమేష్, రాగూర్ హరినాథ్ సింగ్, సిలివేరు ధనుంజయ్య, బాస్కుల దయాకర్, ఎనుగుతల సాంబయ్య, గనిపాక ప్రభాకర్, మంద దయాకర్, గాదె రవిందర్, మామిడాల రాజన్న, మంద బాబు, గనిపాక కొమురయ్య పాల్గొన్నారు.

కార్మిక భవనం నిర్మించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆరెల్లి కృష్ణ

ఖిలా వరంగల్: ఆజంజాహి మిల్లు వర్కర్స్ యూనియన్ బిల్డింగ్ స్థలంలో కార్మిక భవనాన్ని నిర్మించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి ఆరెల్లి కృష్ణ డిమాండ్ చేశారు. ఖిలా వరంగల్ మధ్యకోటలోని ఏకశిల చిల్డ్రన్‌పార్కులో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు గుంగుల దయాకర్, నున్నా అప్పారావు అధ్యక్షతన భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్‌టీయూ రెండవ నగర మహాసభ ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా కృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ 44 కార్మిక చట్టాలను కుదించి భారత కార్మిక వర్గానికి ద్రోహం చేసిందని ఆరోపించారు. ప్రభుత్వ శాఖలో పనిచేస్తున్న డైలీవేజ్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామని చెప్పి హామీని అమలు చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులందరికి నెలకు రూ.20వేల వేతనం ఇవ్వాలని, పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. సమావేశంలో ఏఐకేఎంఎస్ నేత బాలరాజు, ఏలియా రాజు, ఎంఏ ఖాన్, ప్రభాకర్, పుష్ప, ఇనుముల కృష్ణ, ప్రభాకర్, సదానందం, సాంబయ్య, విమల తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా లేకుంటే పార్కు స్థలాలు కబ్జా



సమావేశమైన ప్లాట్ల యజమానులు

హసన్‌పర్తి: ప్లాట్ల యజమానులు ఐక్యంగా లేకుంటే వెంచర్‌కు సంబంధించిన పార్కు స్థలాలు కబ్జాకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని సురభి ఎంక్లేవ్ అసోసియేషన్ అభిప్రాయ పడింది. అసోసియేషన్ సమావేశాన్ని ఎంక్లేవ్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు సిద్దూరి స్వామిరావు అధ్యక్షతన జరిగిన పలు అంశాలపై చర్చించారు. కొంతమంది రియల్టర్లు ఇప్పటికే పార్కు స్థలాలను చదును చేశారని అన్నారు. అప్రమత్తంగా లేకుండా ప్లాట్లు కూడా ఆక్రమణకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. కబ్జాలకు సమర్థవంతంగా ఎదుర్కోవాలని సూచించారు. ఎంక్లేవ్‌లో విద్యుత్ స్తంభాలు నివాస గృహాలకు అనుమతి తీసుకోవాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు అన్నమనేని అప్పారావు, ప్రధాన కార్యదర్శి పుల్లూరి వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ అర్షనపల్లి శ్రీధర్‌రావు, ఆర్గనైజర్ ప్రవీణ్‌కుమార్, కోశాధికారి శ్రీనివాస్, సభ్యులు, ప్లాట్ల యజమానులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్



న్యూశాయంపేట: మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

న్యూశాయంపేట: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో తెలంగాణ మైనార్టీ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ (టీఎస్ -మెసా) రీజినల్ స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. ప్రోగాం కన్వీనర్ అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చీఫ్‌విప్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉద్యోగులకు సీఎం కేసీఆర్ అండగా ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తున్నారని చెప్పారు. టీఎస్ మెసా సంఘానికి హనుమకొండ పట్టణంలో భవనంతో పాటు సంఘ కార్యాలయ నిర్మాణానికి నిధుల మంజూరుకు తోడ్పాటు అందిస్తానని తెలిపారు. టెమ్రిస్ జాయింట్ సెక్రటరీ లియాఖత్ హుస్సేన్ మాట్లాడుతూ మైనార్టీల అభ్యున్నతికి 204 గురుకులాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. ఇటీవల మైనార్టీ కమిషన్ సభ్యుడిగా నియమితులైన దర్శన్‌సింగ్‌ను టీఎస్ మెసా బాధ్యులు సత్కరించారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు ఫారూఖ్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి తోఫికుర్ రహమాన్, హనుమకొండ డీఈఓ అబ్దుల్ హై, రాష్ట్ర నాయకులు మహ్మద్ నయిమ్, రియాజ్ అహ్మద్ ఖాన్, డాక్టర్ రాజ్‌మహ్మద్, నన్నె సాహెబ్, మంజూర్ అలీ, కౌసర్ ఫారూఖీ, గౌస్, నజీర్, సలీం, రాయబోస్, రహీమ్, జిలానీ పాషా, దావుద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణే ధ్యేయం

విద్యారణ్యపురి: ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. హనుమకొండలోని క్యాంపు కార్యాలయంలో వినయ్‌భాస్కర్‌ను తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సదాశివరెడ్డి, ఉపాధ్యక్షుడు సిహెచ్.రవీందర్‌రాజు, కోశాధికారి కిరణ్‌కుమార్, పలువురు బాధ్యులు ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. ప్రధానంగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు ప్రక్రియ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ కార్యదర్శులు స్టాలిన్‌బేగ్, శశిధర్‌రెడ్డి, సీఎస్ఆర్ మల్లిక్, చంద్రయ్య, సదానందం, వరంగల్ జిల్లా అధ్యక్షుడు తాటికాయల కుమార్, ఉపాధ్యక్షుడు దామోదర్, బాధ్యులు సుజన్‌ప్రసాద్, కుమారస్వామి, రవూస్, సత్యనారాయణ, భాస్కర్‌రావు, రవీందర్, వేముల మహేష్ పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా రక్తదానం చేసిన వాకర్స్

కాజీపేట: సామాజిక సేవే లక్ష్యంతో వాకర్స్ సభ్యులు రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ప్రశంసించారు. కాజీపేట 61వ డివిజన్ వడ్డెపల్లి ట్యాంక్ బండ్‌పై వాక్ అండ్ టాక్ కార్యక్రమంలో భాగంగా వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎలకంటి రాములు, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.రవిందర్ రెడ్డి, కార్యదర్శి బి.రాజేశ్వర్, కైలాస్ అగర్వాల్, మహమూద్ అలీ, జె.శ్రీనివాస్ రెడ్డి, జి.రవిందర్ రెడ్డి, కోంద్ర శంకర్, ఎ.శ్రీనివాస్, కె.నర్సింహారావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యను అందించాలి



హన్మకొండ: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ సూచించారు. హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో సుబేదారిలోని ఐవీవై ఇంటర్ నేషనల్ స్కూల్ వార్షికోత్సవం శనివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా చీఫ్‌విప్ మాట్లాడుతూ చిన్ననాటి నుంచే విద్యార్థులకు సామాజిక పరిస్థితులు, మానవ విలువలు వంటి వాటిపై అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం విద్యార్థులకు చీఫ్‌విప్ పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐవీవై ఇంటర్ నేషనల్ స్కూల్ చైర్మన్ మహేష్ పసుల, డైరెక్టర్ సుహాస్ నీలం, ప్రిన్సిపాల్ సమంత పాల్గొన్నారు.